
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం : 23 : మే : 2023



చీనీ టన్ను రూ.37,500
అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.37,500 పలికాయి. మార్కెట్‌కు 780 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



ఆర్‌ఓబీపై అబద్ధాలు ఎందుకు?
కుటాగుళ్ల రైల్వే గేట్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబి) నిర్మాణానికి సంబంధించి ఎమ్మెల్యేపై అవాస్తవాలు ప్రచారం చేయడంపై ముస్లిం మైనారిటీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. IIలో



వర్షం కురిసినప్పటికీ వేసవి తాపం తగ్గలేదు. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగానే ఉంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి.

పవర్ ఫుల్



తరచూ కాలిపోయే మోటార్లు.. పాత ట్రాన్స్‌ఫార్మర్లతో పాట్లు... లోఓల్టేజీతో సతమతం.. కరెంటు కోతలతో అవస్థలు.. ఇలా ఎన్నో సమస్యలతో అన్నదాతలు ఇబ్బందులు పడేవారు. అయితే ఇదంతా గతం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యుత్ సంస్కరణలకు శ్రీకారం చుట్టడంతో కరెంట్ కష్టాలకు చెక్ పడింది.

- విద్యుత్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం
- హెచ్‌వీడీఎస్ ద్వారా నాలుగేళ్లలో రూ.1,600 కోట్లకు పైగా వ్యయం
- లక్షకు పైగా ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ
- కరెంటు కష్టాలకు చెక్
- నాణ్యమైన విద్యుత్ సరఫరాపై అన్నదాతల హర్షం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: విద్యుత్ సంస్కరణల్లో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనుల ఫలాలు రైతులకు చేరాయి. విద్యుత్ సరఫరాలో ఏ ఒక్క రైతుకూ నష్టం జరగకుండా చూడాలన్న సీఎం వైఎస్ జగన్ ఆశయం నెరవేరింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేపట్టిన హెచ్‌వీడీఎస్ (హై ఓల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం)తో రైతులకు ఊరట కలిగింది. నాలుగేళ్లకు మునుపు లో ఓల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

1.89 లక్షల మందికి ఊరట

విద్యుత్ లైన్లు మొదలుకొని, ట్రాన్స్‌ఫార్మర్ల వరకూ హెచ్‌వీడీఎస్‌లో భాగంగా తాజాగా పనులు చేపట్టారు. 16 కేవీఏ, 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, కొత్త విద్యుత్ లైన్లు వంటివి భారీగా వేశారు. దీనివల్ల 1,89,279 వ్యవసాయ కనెక్షన్లు ఉన్న రైతులు ఇబ్బందులు తప్పాయి. ఓల్టేజీ సమస్యతో పాటు మోటార్లు కాలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అవడం లాంటివి ఇప్పుడు మచ్చుకు కూడా లేవు. అభివృద్ధి పనులకు తోడు కోతల్లేని నిరంతర 9 గంటల విద్యుత్ కూడా సరఫరా చేస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1608 కోట్ల వ్యయం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో నాలుగేళ్లలో హెచ్‌వీడీఎస్ కింద రూ.1608.98 కోట్లు వ్యయం చేశారు. దీన్నిబట్టి విద్యుత్ సంస్కరణలు ఏ స్థాయిలో జరిగాయో అంచనా వేయొచ్చు. అనంతపురం జిల్లాలో రూ.916.86 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో రూ.692.12 కోట్లు ఖర్చు చేశారు. అత్యధికంగా ఒక్క శింగనమల నియోజకవర్గంలోనే రూ.313 కోట్లు వ్యయం చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో అత్యధికంగా మడకశిర నియోజకవర్గంలో రూ.144.44 కోట్లు ఖర్చు చేసి మెరుగైన విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు.

హెచ్‌వీడీఎస్ పరిధిలోకి వచ్చిన వ్యవసాయ కనెక్షన్లు, చేసిన వ్యయం

శ్రీసత్యసాయి జిల్లాలో...

నియోజకవర్గం	సర్వీసులు	చేసిన వ్యయం
ధర్మవరం	14,344	రూ.124.06 కోట్లు
హిందూపురం	5,825	రూ.50.82 కోట్లు
కదిరి	10,815	రూ.93.40 కోట్లు
మడకశిర	16,979	రూ.144.44 కోట్లు
పెనుకొండ	12,298	రూ.103.01 కోట్లు
పుట్టపర్తి	15,422	రూ.131.39 కోట్లు
రాప్తాడు	5,298	రూ.45.00 కోట్లు

హెచ్‌వీడీఎస్ పనులు ఇలా...

మదర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు	9,158
16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ	25,570
25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ	77,965



వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్



నాకు రెండు వ్యవసాయ విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. గతంలో లాగా ఇప్పుడు లోఓల్టేజీ సమస్య లేదు. బోర్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా పంటలను సాగు చేసుకుంటున్నాం. ఏదైనా ఇబ్బంది తలెత్తినా సిబ్బంది వెంటనే స్పందిస్తున్నారు.
– తిప్పేఅడివప్ప, హరేసముద్రం, మడకశిర మండలం

లోఓల్టేజీ సమస్య లేదు



హెచ్‌వీడీఎస్‌తో మాకు భారీ ఊరట కలిగింది. గతంలో మాదిరి లోఓల్టేజీ సమస్య లేదు. మోటార్లు బాగా ఆడుతున్నాయి. పంటకు సరిపడా నీరందుతోంది. మోటార్లు కాలిపోవడం, ఫెయిల్ కావడం అన్న సమస్యే లేదు. వైఎస్ జగన్ రైతులకు చేస్తున్న మేలు మరువలేం.
– జనార్దన్‌రెడ్డి, పెదపల్లి, పుట్టపర్తి మండలం

నాణ్యమైన విద్యుత్ సరఫరా



గతంలో ఎప్పుడూ లేనివిధంగా రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నాం. హెచ్‌వీడీఎస్ ద్వారా అభివృద్ధి పనులు చేపట్టడం వల్ల విద్యుత్ వ్యవస్థలో మెరుగైన ఫలితాలు వచ్చాయి. రైతులకు ఇబ్బందుల్లేకుండా కరెంటు సరఫరా చేస్తున్నాం.
– సురేంద్ర, ఎస్‌ఈ

న్యూస్‌రీల్

విత్తన రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి



విత్తన శుద్ధి కేంద్రంలో విత్తన నాణ్యతను పరిశీలిస్తున్న డీఏఓ సుబ్బారావు

కదిరి అర్బన్: వేరుశనగ విత్తన రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి, కదిరి మండల స్పెషలాఫీసర్ సుబ్బారావు వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన విత్తన శుద్ధి కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలను రాయితీతో అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శుద్ధి చేసిన విత్తన నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ఎమ్మార్సీ కేంద్రాన్ని తనిఖీ చేసి నిల్వ చేసిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం వస్త్రాన్ని పరిశీలించారు. స్టాకు వివరాలను ఎంఈఓ చెన్నకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏడీఏ సత్యనారాయణతో పాటు పలువురు వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

అరటి రైతులను ఆదుకోవాలి

- కలెక్టర్‌ను కోరిన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



పంట నష్టం గురించి కలెక్టర్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: గాలివానతో అరటి తోటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన కనగానపల్లి మండల రైతులను ఆదుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోమవారం కలెక్టర్ అరుణ్ బాబును కోరారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, ఆదివారం రాత్రి కురిసిన వర్షాలకు చాలా పంటలు దెబ్బతిన్నాయన్నారు. కనగానపల్లి మండలంలోని బద్దలాపురం గ్రామానికి చెందిన రైతులు చంద్రాయుడు, కృష్ణారెడ్డి, నాగరాజు తదితర రైతులకు చెందిన సుమారు 300 ఎకరాల్లోని అరటి తోటలు ధ్వంసమయ్యాయన్నారు. పంట నష్ట పోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు ఇన్సూరెన్స్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

17 మండలాల్లో వర్షం



పిడుగు పడటంతో కాలుతున్న కొబ్బరిచెట్టు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ 17 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. హిందూపురం మండలంలో 57.4 మి.మీ, సోమందేపల్లి 53.4 మి.మీ, పెనుకొండ 38.6 మి.మీ, కొత్తచెరువు 30.6 మి.మీ, బుక్కపట్నం 20 మి.మీ, నల్లమాడ 19.4 మి.మీ, బత్తలపల్లి 15.8 మి.మీ, పుట్టపర్తి 14 మి.మీ, అమరాపురం 12.6 మి.మీ, రొద్దం 12.2 మి.మీ, తాడిమర్రి, పరిగి మండలాల్లో 8.6 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. మిగిన మండలాల్లోనూ చెప్పుకోదగ్గ వర్షం కురిసింది. గాలివాన, ఉరుములతో కూడిన వర్షానికి జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా పంటనష్టం జరిగింది.

కొబ్బరి చెట్టుపై పడిన పిడుగు..

సోమవారం తెల్లవారుజామున పుట్టపర్తి మండలం పెడపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మేకల నరసింహప్ప పెరటిలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో చెట్టు కాలిపోయింది.

50 మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

అనంతపురం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పురోగతిలో వెనుకబడిన 50 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ చేయూత, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ వాహన మిత్ర, వైఎస్సార్ నేతన్న నేస్తం, జగనన్న తోడు, ఈబీసీ నేస్తం తదితర పథకాల పురోగతిలో వెనుకబడిన విద్యా సహాయకులు, వార్డు సంక్షేమ అభివృద్ధి కార్యదర్శులకు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.

డిప్లొమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం అగ్రికల్చర్: సహకార శాఖ ఆధ్వర్యంలో డిప్లొమా ఇన్ కో ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్ కోర్సు చేయాలనుకునే వారు జూన్ 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక రాయలసీమ సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 8వ బ్యాచ్ కింద 24 వారాల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. సహకార సంస్థలు, సహకార సంఘాల్లో పనిచేస్తున్న సిబ్బందికి తప్పనిసరిగా కోర్సు ఉండాలని నిర్దేశించినందున... సహకార చట్టం కింద రిజిష్టర్ అయిన సంస్థలు, సంఘాల సభ్యులు, పాలక వర్గాలు, సిబ్బంది ఉపయోగించుకోవాలని సూచించారు. సహకార సంస్థల సిబ్బందికి 10వ తరగతి, ఇతరులు ఇంటర్ ఉత్తీర్ణత అయిన వారు డిప్లొమా కోర్సుకు అర్హత అన్నారు. వివరాలకు ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు సెల్ నంబర్ 77803 01899ను సంప్రదించాలని సూచించారు.

రీ సర్వే సకాలంలో పూర్తి చేయాలి



వీసీలో మాట్లాడుతున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని 54 గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వే సకాలంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, రీసర్వే పూర్తి చేసేందుకు ప్రభుత్వం 90 రోజులు గడువు ఇచ్చిందని, ఆలోపు రీసర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డీఎల్ఆర్(డ్రాఫ్ ల్యాండ్ రిజిష్టర్)ను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. తొలుత భూ రికార్డుల స్వచ్ఛీకరణ ప్రక్రియ పూర్తి చేస్తే ఆయా గ్రామాల్లో భూముల రీ సర్వే సులభమవుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ కొండయ్య, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, తహసీల్దార్ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టం లేకపోతే వెళ్లిపోండి

- ఉద్యోగం ఉండాలంటే బాధ్యతగా పనిచేయండి
- అధికారులపై కలెక్టర్ అరుణ్‌బాబు ఆగ్రహం
- స్పందన'లో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: "జిల్లా ట్రెజరీ అధికారులు సక్రమంగా పని చేయడం లేదని చాలా ఫిర్యాదులు అందాయి. పనితీరు మార్చుకుంటారని సూచనలతో ఇప్పటివరకూ సరిపెట్టా. ఇక ఉపేక్షించను. ఇక్కడ ఉండాలంటే ఏ అధికారి అయినా సరే బాధ్యతగా పనిచేయాల్సిందే. ఇష్టం లేకపోతే ఇతర జిల్లాలకు వెళ్లి పోవచ్చు. అలాకాకుండా ఇక్కడే ఉంటూ సరిగా పనిచేయకపోతే కఠిన చర్యలు తప్పవు'' అని కలెక్టర్ అరుణ్‌బాబు గట్టిగా హెచ్చరించారు. సోమవారం ఆయన జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖలతో కలిసి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. 19వ తేదీన జిల్లా అధికారుల క్షేత్రస్థాయి పర్యటనలో పలు సమస్యలను గుర్తించి నివేదిక ఇచ్చారని, ఆయా సమస్యలు సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సంక్షేమ కార్యక్రమాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు', గ్రామ సచివాలయాలు, నాడు-నేడు, గడప గడపకూ మన ప్రభుత్వంలో గుర్తించిన పనులను పూర్తి చేయాలని సూచించారు.

షోకాజ్ నోటీస్ ఇవ్వండి..

భోజనం, బాలామృతం సక్రమంగా పంపిణీ చేయని ఎస్సీ కుంట అంగన్‌వాడీ కార్యకర్తకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. ఓడీసీ పరిధిలో 3 కేంద్రాలకు మౌలిక వసతులు లేవని, లేపాక్షి, పరిగి, గోరంట్ల మండలాల్లో మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు సమస్యలు గుర్తించామన్నారు. వారం రోజుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వసతులన్నీ కల్పించాలన్నారు. తల్లిదండ్రులిద్దరూ చనిపోవడంతో సరైన అండలేక ఇబ్బంది పడుతున్న రొళ్ల మండలానికి చెందిన కొట్టాల లావణ్యకు 'వాత్సల్య' పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. అలాగే పాఠశాలలు తెరిచే నాటికి జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ పూర్తి కావాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీపీఓ విజయ్‌కుమార్, డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, డీఈఓ మీనాక్షి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్‌ఖాన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, డీహెచ్ఓ చంద్రశేఖర్, డ్వామా పీడీ రామాంజనేయులు, సోషల్ వెల్ఫేర్ ఏడీ శివరంగప్రసాద్ తదితరులు ఉన్నారు.

వివిధ సమస్యలపై 189 అర్జీలు..

'స్పందన' కార్యక్రమంలో అందే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ అర్జీలు రీఓపెన్ కాకూడదని కలెక్టర్ తెలిపారు. వివిధ సమస్యలపై మొత్తం 189 అర్జీలను అందగా, వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.

నా కుమారుడి నుంచి కాపాడండి

- ఆస్తి కోసం కుమారుడు తమను తీవ్రంగా వేధిస్తున్నాడని దివ్యాంగుడు నబీఖాన్, ప్యారీ దంపతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు ఇద్దరు కుమారులు సంతానం కాగా, చిన్న కుమారుడైన బేల్దారి బాబ్‌జాన్‌ఖాన్ అతని భార్య ముబీనాతో తాము కలిసి ఉంటున్నామని, ఇన్నాళ్లూ తమను బాగానే చూసుకున్నారన్నారు. కదిరిలోని ఇంటిని చిన్న కుమారుడైన బేల్దారి బాబ్‌జాన్‌ఖాన్‌కు దాన విక్రయం చేశామని, ఆ తర్వాత నుంచి కుమారుడు, కోడలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇంటిని వదిలి వెళ్లకపోతే చంపేస్తామని బెదిరిస్తున్నారనీ, 18వ తేదీన తమను ఇంట్లోకి వేసి తాళం వేసి వెళ్లిపోయారన్నారు. డయల్ 100కు కాల్ చేయగా, పోలీసులు వచ్చి తాళం తీసి తమను రక్షించారన్నారు. తమకు రక్షణ కల్పించాలని, అలాగే తాముంటున్న ఇంటి నుంచి కుమారుడు, కోడలను పంపించివేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ సీఐ రామాంజనేయులును ఆదేశించగా, ఆయన నబీఖాన్, ప్యారీ దంపతులతో మాట్లాడి భరోసా ఇచ్చారు.

టీచర్ల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

- మార్గదర్శకాలు విడుదల... త్వరలో షెడ్యూలు

రాప్తాడురూరల్: టీచర్ల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకోసం మార్గదర్శకాలు రూపొందించిన జీఓ 47ను విడుదల చేసింది. బదిలీలకు సంబంధించిన షెడ్యూలు మాత్రం ఇంకా వెల్లడించలేదు. త్వరలోనే షెడ్యూలు విడుదల అవుతుందని అధికారులు చెబుతున్నారు. 5 అకడమిక్ సంవత్సరాలు పూర్తయిన హెచ్‌ఎంలు, 8 అకడమిక్ సంవత్సరాల సర్వీస్ పూర్తయిన టీచర్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. ఆ ప్రకారం ఒక స్కూల్‌లో 2018 నవంబరు 18లోపు చేరిన హెచ్‌ఎంలు, 2015 నవంబరు 18లోపు చేరిన టీచర్లు బదిలీ అవుతారు. జీరో సర్వీసు ఉన్నవారు కూడా బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

- పాత జిల్లాల ప్రకారం వెబ్‌కౌన్సెలింగ్ విధానంలో బదిలీలు ఉంటాయి. 2025 మే 31 లోపు (రెండేళ్లలోపు) పదవీ విరమణ చేయబోయే వారు కోరకుంటే తప్ప బదిలీ చేయరు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే టీచర్లకు మాత్రమే ప్రిఫరెన్షల్ కేటగిరీగా పరిగణిస్తారు. వారి పిల్లలు, తల్లిదండ్రులు, భర్త/భార్య బాధపడుతుంటే మాత్రం వర్తించదు. దృష్టిలోపం (40 శాతం) ఉన్న టీచర్లు, ఆర్థోపెడికల్ ఛాలెంజ్డ్ టీచర్లకు (75 శాతం) బదిలీల నుంచి మినహాయింపు ఉంటుంది. అయితే ఆసక్తి ఉంటే బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
- మొదటి కేటగిరీ పాఠశాలల్లో పని చేసే టీచర్లకు ఏడాదికి 1 పాయింటు, రెండో కేటగిరీ పాఠశాలల టీచర్లకు రెండు పాయింట్లు, మూడో కేటగిరీ పాఠశాలల టీచర్లకు మూడు పాయింట్లు, నాల్గో కేటగిరీ పాఠశాలల టీచర్లకు ఐదు పాయింట్లు కేటాయిస్తారు.
- అవివాహితులు, స్పౌజ్, పీహెచ్ కేటగిరీ, గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు 5 పాయింట్ల చొప్పున కేటాయిస్తారు. సర్వీస్‌కు సంబంధించి ఏడాదికి 0.5 మార్కులు కేటాయిస్తారు.

30 కేంద్రాల్లో ఇంటర్ సప్లిమెంటరీ




అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకూ జిల్లాలోని 30 కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. పరీక్షల నిర్వహణపై సోమవారం ఆయన తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో సుమారు 11 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి ఏఎన్‌ఎంలను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ కొండయ్య, ఇంటర్ విద్య ఆర్ఐఓ సురేష్‌బాబు, డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, డీఈఓ మీనాక్షి, లేబర్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సూర్యనారాయణ, డీవైఈఓ రఘునాథరెడ్డి, ఆర్టీసీ డీఎం ఇనయితుల్లా, పోస్టల్ అధికారి జయపాల్‌రెడ్డి, జిల్లా ఫైర్ అధికారి శంకరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తమ' విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

- జిల్లాలో 25 నుంచి 'జగనన్న ఆణిముత్యాలు'
- విజయవంతానికి డీఈఓ మీనాక్షి పిలుపు



ప్రశాంతి నిలయం: ఇటీవల వెలువడిన పదోతరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో మెరుగైన మార్కులు సాధించిన వారిని సన్మానించేందుకు ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈఓ మీనాక్షి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే కార్యక్రమాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 25వ తేదీన నియోజకవర్గ స్థాయిలో, 27న జిల్లా స్థాయిలో, 31వ తేదీన రాష్ట్ర స్థాయిలో కార్యక్రమం ఉంటుందన్నారు.

పదో తరగతిలో 52 మందికి..

పదో తరగతి ఫలితాల్లో మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థుల్లో నియోజకవర్గ స్థాయిలో 23 మందిని, జిల్లా స్థాయిలో 29 మందిని ఎంపిక చేశామన్నారు. వీరందరికీ నగదు బహుమతితో పాటు మెమెంటో అందజేస్తామన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.15,000, రెండో బహుమతిగా రూ.10,000, మూడో బహుమతిగా రూ.5,000 చొప్పున నగదు పురస్కారం అందజేస్తామన్నారు. అలాగే జిల్లా స్థాయిలో మొదటి బహుమతిగా రూ.50,000, రెండో బహుమతిగా రూ.30,000, మూడో బహుమతిగా రూ.15,000 చొప్పున అందజేస్తామన్నారు.

48 మంది ఇంటర్ విద్యార్థులకు..

ఇంటర్మీడియట్ సంబంధించి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల్లో నియోజకవర్గ స్థాయిలో 24 మందిని, జిల్లా స్థాయిలో 24 మందిని ఎంపిక చేశామన్నారు. ప్రతి గ్రూప్ నుంచి ఒక్కరిని ఎంపిక చేసి వారికి నియోజకవర్గస్థాయిలో రూ.15,000, జిల్లా స్థాయిలో రూ.50,000 చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేస్తామన్నారు. అలాగే విద్యార్థులు చదివిన పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులనూ మెమెంటోలు అందజేస్తామని, తల్లిదండ్రులను దుశ్శాలువాలతో సన్మానిస్తామన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

కొత్తచెరువు: బహిరంగ ప్రదేశాలలో బీడీ, సిగరెట్, గుట్కా వంటివి నిషేధింపబడినవని, ఎవరైనా వీటిని ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో పొగాకు నియంత్రణ అధికారి డాక్టర్ నివేదితతో కలిసి 'సీఓటీపీఏ-2003' యాక్ట్‌కు సంబంధించి జిల్లా వైద్యఆరోగ్యశాఖ రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పొగాకు నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు వైద్యఆరోగ్యశాఖతో కలిసి పనిచేస్తామన్నారు. పొగాకు ఉత్పత్తులను బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేసినా, విక్రయించినా, వినియోగించినా జరిమానా విధిస్తామన్నారు. అంతేగాక స్కూళ్లు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు 300 అడుగుల దూరంలో మత్తు పదార్థాలు నిల్వ చేయకూడదన్నారు. మండల స్థాయిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను పెంచి వైద్యారోగ్యశాఖ, ఎంఈఓ, ఎంపీడీఓలతో కలిసి పనిచేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈఎంఓ బాబాఫక్రుద్దీన్, సోషల్ వర్కర్ త్రిలోక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి


మృతుడు వెంకటేష్

ధర్మవరం రూరల్: మండలంలోని పోతుకుంట గ్రామం వద్ద వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లిన విద్యార్థి నీట మునిగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరంలోని శాంతి నగర్‌కు చెందిన లక్ష్మీదేవి, శ్రీనివాసులు దంపతుల కుమారుడు వెంకటేష్ (22) గుంటూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో సీఏ రెండో సంవత్సరం చదువుతున్నాడు. సెలవుల నేపథ్యంలో ఇంటికి వచ్చిన ఆయన స్నేహితులతో కలసి సోమవారం ఉదయం పోతుకుంట వద్ద బావి వద్దకు సరదాగా ఈతకు వెళ్లాడు. అయితే ఈత రాకపోవడంతో నీట మునిగాడు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టి వెంకటేష్ మృతదేహాన్ని వెలికి తీశారు. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వరిగి: మండలంలోని శీగుపల్లి, గణపతిపల్లి వద్ద రహస్య ప్రాంతాల్లో సోమవారం పేకాట ఆడుతున్న పది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. నిందితుల నుంచి రూ.16,050 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

హిందూపురం: సహజీవనం చేస్తూ చిన్నపాటి గొడవ కారణంగా మహిళను హత్య చేసిన కేసులో అజీముద్దీన్ అలియాస్ అజీమ్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. హిందూపురం మండలం కొటిపి గ్రామంలోని బసవేశ్వరకాలనీలో భర్తను వదిలి ఒంటరిగా జీవిస్తున్న వివాహిత సరన్యతో సహజీవనం చేస్తున్న అజీమ్ గత మార్చి 15న గొడవ పడి ఆమెను తోసేయడంతో కింద పడి తలకు గాయమై చనిపోయింది. అప్పటి నుంచి పరారీలో ఉన్న అజీమ్ సోమవారం ఉదయం పరిగి బస్టాండ్‌లో తచ్చాడుతుండగా పోలీసులు గుర్తించి, అరెస్ట్ చేశారు.

ఆర్‌ఓబీపై అబద్ధాలు ఎందుకు?

- టీడీపీ హయాంలోనే 4లైన్ల బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు
- నాటి అలైన్‌మెంట్‌తో నేలమట్టం కానున్న మసీదు
- వాస్తవాలు గుర్తించిన కదిరి ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి
- ఎమ్మెల్యే చొరవతో 2లైన్ల బ్రిడ్జి ఏర్పాటుకు రైల్వేశాఖ చర్యలు


కుటాగుళ్ల రైల్వే గేట్ వద్ద గేట్ పడటంతో ఆగిన వాహనాలు

కదిరి: కదిరి–అనంతపురం జాతీయ రహదారిపై కదిరి మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల రైల్వే గేట్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ)నిర్మాణానికి రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. 4 లైన్లతో బ్రిడ్జి నిర్మాణానికి 2016, మే 30న అప్పటి టీడీపీ ప్రభుత్వంతో పాటు నాటి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించాయి. దీని కోసం 2016 జూలై 13న రైల్వే శాఖ ఉత్తర్వులు కూడా జారీ చేసింది. నాటి అలైన్‌మెంట్ ప్రకారం అక్కడ 4 లైన్ల బ్రిడ్జి నిర్మాణం చేపడితే అక్కడ రోడ్డు పక్కనే ఉన్న మసీదుతో పాటు కబరస్తాన్ పూర్తిగా నేలమట్టం అవుతుంది. ఇది తెలిసినా అప్పటి టీడీపీ ప్రభుత్వం కానీ, ఆ పార్టీ స్థానిక నాయకులు గానీ నోరు మెదపలేదు.

ఎమ్మెల్యే సిద్దారెడ్డి చొరవపై స్థానికుల హర్షం..

రాష్ట్రంలో 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి... 4 లైన్ల రైల్వే బ్రిడ్జి నిర్మాణంతో మసీదుతో పాటు కబరస్తాన్‌కు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతుందని గుర్తించారు. ఈ వాస్తవాలను వివరిస్తూ 2020లో ఆయన రైల్వే శాఖకు ఓ లేఖ రాశారు. 4 లైన్లతో కాకుండా 2 లైన్లతో నిర్మాణం చేపట్టాలంటూ లేఖలో కోరారు. దీనికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. 2 లైన్ల బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే చీఫ్ ఇంజినీర్ ఎస్.జనార్దన్‌రెడ్డి 2020, ఫిబ్రవరి 20న దక్షిణ మధ్య రైల్వేతో అంగీకారం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా 2 లైన్ల బ్రిడ్జి నిర్మాణ పనుల ప్రక్రియ వేగం పుంజుకుంది. ఈ విషయంలో ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి చూపిన చొరవకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పచ్చ మీడియా పచ్చి అబద్ధాలు..

కుటాగుళ్ల వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించి అక్కడున్న మసీదును నేలమట్టం చేయాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో పాటు స్థానిక ఎమ్మెల్యే కుట్ర చేస్తున్నట్లుగా పచ్చ మీడియాకు సంబంధించిన ఓ తోక పత్రిక ఇటీవల పచ్చి అబద్ధాలను ప్రచురించింది. ఈ కథనంపై స్థానికంగా ఉన్న ముస్లిం మైనార్టీలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఈ తరహా తప్పుడు కథనాలతోనే రాష్ట్రంలో టీడీపీకి పుట్టగతులు లేకుండా పోతున్నాయని బహిరంగంగా విమర్శిస్తున్నారు.

వక్ఫ్ ఆస్తులపై కన్ను..

కదిరి మున్సిపాలిటీ పరిధిలోని వక్ఫ్ ఆస్తులపై కన్నేసిన కొందరు టీడీపీ నేతలు ఆ పార్టీ స్థానిక నాయకుడితో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని జేఏసీ పేరుతో జత కట్టి ముస్లింల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని కుటాగుళ్ల దర్గా కమిటీ సభ్యులు మండిపడుతున్నారు. వారికి మసీదులో ఉన్న ముతవలి సహకరిస్తున్నారని, ఆయన కూడా వక్ఫ్ ఆస్తులను కబ్జా చేయాలనుకునే కుట్రదారులతో చేతులు కలిపారని కమిటీ ఆరోపిస్తోంది. కుటాగుళ్ల రైల్వే గేట్ వద్ద సర్వే నెం.400ఏ లో ఉన్న అత్యంత విలువైన వక్ఫ్ స్థలాన్ని కబ్జా చేయాలని చేస్తున్న దుర్మార్గులే ప్రస్తుతం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని కమిటీ సభ్యులు మండిపడుతున్నారు. రానున్న రోజుల్లో ఇదే మార్గంలో పెద్ద ఎత్తున రైళ్లు ప్రయాణిస్తాయని, అక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. ముస్లింల పక్షాన నిలబడిన ఎమ్మెల్యేపై అసత్యాలు ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని కుటాగుళ్లలోని ముస్లింలందరూ ముక్త కంఠంతో హెచ్చరించారు.

ప్రజలు క్షమించరు



కొందరు స్వార్థ పరులు కుటాగుళ్ల వద్ద ఫ్లెఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని అడ్డుకోవాలని కుట్ర చేస్తున్నారు. అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలు క్షమించరు. ఇక్కడ ఆర్‌ఓబీ నిర్మాణం ఎంతో అవసరం. ఇప్పుడే రైల్వే గేట్ పడితే అరగంటకు పైగా వేచి ఉండాలి. భవిష్యత్‌లో రైళ్ల సంఖ్య పెరిగితే పరిస్థితి ఇంకెత దారుణంగా ఉంటుందో ఊహించుకుంటే భయమేస్తుంది. మసీదుకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఎమ్మెల్యే డా.సిద్దారెడ్డి 4 లైన్ల బ్రిడ్జిని 2 లైన్లకు కుదించేలా చొరవ తీసుకున్నారు. ఆయనపై అసత్య ఆరోపణలు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరు. – మహమ్మద్, మున్సిపల్ కౌన్సిలర్, కుటాగుళ్ల

అభివృద్ధి మా అజెండా



కుటాగుళ్ల రైల్వే గేట్ వద్ద 4 లైన్ల ఆర్‌ఓబీ నిర్మించాలని టీడీపీ హయాంలోనే నిర్ణయించారు. దీంతో అక్కడున్న మసీదు పూర్తిగా నేలమట్టం అవుతుందని భావించి దానిని 2 లైన్లకు కుదించాలని 2020లో నేను రైల్వే శాఖను కోరాను. అలాగే తాజాగా టెండర్లు పిలిచారు. దీనిని కొందరు స్వార్థపరులు రాజకీయం చేస్తూ నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లకుండా అభివృద్ధే అజెండాగా మేం ముందుకెళుతున్నాం. – డా.పీవీ సిద్దారెడ్డి, ఎమ్మెల్యే, కదిరి

'పోలీస్ స్పందన'కు 49 వినతులు


సమస్యకు పరిష్కారం చూపాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓను ఫోన్ ద్వారా ఆదేశిస్తున్న ఎస్పీ

కొత్తచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 49 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఫోన్ ద్వారా ఆదేశించారు. కార్యక్రమంలో పోలీస్ లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, ఎస్‌బీ సీఐ రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

స్టేట్ బెస్ట్ బాక్సర్‌గా పవన్

విశాఖ స్పోర్ట్స్: అంతర జిల్లాల 6వ యూత్ మెన్ బాక్సింగ్ పోటీల్లో టీమ్ చాంపియన్‌షిప్‌ను విశాఖ జట్టు కైవసం చేసుకుంది. 14 పాయింట్లతో రన్నరప్‌గా విజయనగరం జట్టు నిలిచింది. డీఆర్‌ఎం కుప్పేరిట రైల్వే బాక్సింగ్ హాల్‌లో 13 వెయిట్ కేటగిరిల్లో పోటీలు నిర్వహించారు. బెస్ట్ బాక్సర్‌గా బాంటమ్ వెయిట్‌లో వి.పవన్(అనంతపురం) నిలవగా... బెస్ట్ లూజర్‌గా బాంటమ్ వెయిట్‌లోనే బి.ప్రసాద్(విశాఖ) నిలిచాడు. అలాగే 54–57 కేజీల ఫెదర్ వెయిట్ కేటగిరిలో వై.హరీష్(అనంతపురం) తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని అందుకున్నాడు. ఈ చాంపియన్‌షిప్‌లో ఏపీలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన యూత్ బాక్సర్లు పోటీ పడగా.. ఆయా కేటగిరిల్లో విజేతగా నిలిచిన బాక్సర్లను ఏపీ యూత్ మెన్ జట్టుగా ఎంపిక చేసి త్వరలో జరగనున్న అంతర్రాష్ట్ర మెన్ యూత్ చాంపియన్‌షిప్‌కు అర్హత కల్పించనున్నారు. ఫైనల్‌లో లూజర్లు స్టాండ్‌బైగా నిలవనున్నారు. పోటీల ముగింపు కార్యక్రమానికి డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి హాజరై విజేతలకు ట్రోఫీలందించారు.

విద్యుదాఘాతంతో వలస కార్మికుడి మృతి


మృతుడు శ్యామ్‌బుర్యా పవర్

బత్తలపల్లి: బతుకు తెరువు నిమిత్తం వలస వచ్చిన మహారాష్ట్ర యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మహారాష్ట్రలోని రాయనగర్ జిల్లా, సుధాఘడ్ తాలూకా, తలై గ్రామానికి చెందిన శ్యామ్‌బుర్యా పవర్(19) తన బావ దీపక్ రాజ్ వాగ్ మేర్, అక్క మేరీతో కలసి మూడు నెలల క్రితం బతుకు తెరువు కోసం బత్తలపల్లిలోని తంబావురం గ్రామానికి వలస వచ్చాడు. గ్రామ సచివాలయం సమీపంలో డేరా ఏర్పాటు చేసుకుని, బొగ్గులు కాల్చి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి డేరాలో టేబుల్ ఫ్యాన్‌ను ఆన్ చేసేందుకు ప్రయత్నించిన శ్యామ్ బుర్యా ఒక్కసారిగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

లేపాక్షి: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ ఓ వ్యక్తి పోలీసులకు పట్టుబడ్డాడు. హిందూపురం డీఎస్పీ కంజాక్షన్ ఆదేశాల మేరకు హిందూపురం రూరల్ సీఐ వేణుగోపాల్ పర్యవేక్షణలో ఎస్‌ఐ మునీర్‌అహమ్మద్ సోమవారం చోళసముద్రం సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో మద్దిపి గ్రామానికి చెందిన రాజశేఖర్ ద్విచక్ర వాహనంపై కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేశారు.

గాయపడ్డ యువకుడి మృతి

సోమందేపల్లి: మండలంలోని బ్రాహ్మణపల్లి సమీపంలో ఈ నెల 18న చోటు చేసుకున్న ప్రమాదంలో గాయపడిన పందిపర్తి గ్రామానికి చెందిన నాగప్ప కుమారుడు అభి(20) ఆదివారం రాత్రి మృతి చెందాడు. తన ద్విచక్ర వాహనంపై హిందూపురానికి బయలుదేరిన ఆయన బ్రాహ్మణపల్లి వద్ద వాహనం అదుపు తప్పి కిందపడి గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని అనంతపురంలోని ఆస్పత్రిలో కుటుంబసభ్యులు చేర్పించారు. చికిత్సకు స్పందించక ఆదివారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గజేంద్ర పందిపర్తికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య


మృతురాలు వర్షిణి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మ్యూజిక్‌పై మమకారాన్ని చంపుకోలేక ఓ నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా కొత్త చెరువు మండలం బైరాపురం గ్రామానికి చెందిన నరసింహమూర్తి, జ్యోతి దంపతుల కుమార్తె వర్షిని (19)... అనంతపురంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. కొద్ది రోజుల క్రితం సెలవులుండటంతో సొంతూరుకు వెళ్లి తిరిగి సోమవారం మధ్యాహ్నం 11.30 గంటలకు హాస్టల్‌కు చేరుకుంది. ఏం జరిగిందో తెలియదుగాని హాస్టల్‌లోని తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా గుర్తించిన తోటి మిత్రుల నుంచి సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ రవిశంకర రెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్యకు దారి తీసిన కారణాలపై ఆరా తీశారు. మ్యూజిక్ అంటే వర్షిణికి చాలా ఆసక్తి అని, అయితే మ్యూజిక్‌తో భవిష్యత్తు ఉండదని, బుద్ధిగా చదువుకోవాలని తల్లిదండ్రులు హితవు పలికినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ కారణంగానే ఆమె ఆత్మహత్య చేసుకుని ఉంటుందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం అందజేశామని, వారు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గిరిజన సంక్షేమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

గోరంట్ల: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో చేరడానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో మూడో తరగతిలో 40 సీట్లు, నాల్గో తరగతిలో 35, ఐదో తరగతిలో 20, 6వ తతరగతిలో 20, 8వ తరగతిలో 7, 9వ తరగతిలో 2 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. లాటరీ విధానం ద్వారా సీట్లు కేటాయించనున్నారు. పూర్తి వివరాలకు 90004 81733లో సంప్రదించవచ్చు.

లక్ష్మీకాంతమ్మ సస్పెన్షన్‌కు రంగం సిద్ధం

- సిఫారసు చేసిన కలెక్టర్ గౌతమి
- ఒకే ఏడాదిలో 99 అబార్షన్లు
- వైద్యాధికారుల విచారణలో వెలుగుచూసిన వాస్తవాలు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని గైనిక్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంతమ్మ సస్పెన్షన్‌కు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఆమె సస్పెన్షన్‌కు కలెక్టర్ గౌతమి సిఫారసు చేశారు. ఇటీవల ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామానికి చెందిన గర్భిణీ కవిత(25)కు అబార్షన్ చేసి, మృతికి కారణమైందన్న ఆరోపణల్లో, వెల్లువెత్తిన నేపథ్యంలో దీనిపై 'అనంతలో దారుణం, చిదిమేస్తున్నారు, కదిలిన వైద్యురాలి అక్రమాల డొంక, అన్నీ అబద్ధాలే' తదితర శీర్షికలతో 'సాక్షి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. దీనిపై స్పందించిన కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్, డెమో బృందం ఇటీవల అమ్మవారిపల్లి, చిగిచెర్ల గ్రామాలను సందర్శించి మృతురాలి కుటుంబీకులతో స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అంతేకాక ఘటనకు సంబంధించి డాక్టర్ లక్ష్మీకాంతమ్మ, రూత్ ఆస్పత్రిపై అనంతపురం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

99 మందికి అబార్షన్లు..

వైద్యాధికారుల విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతుల్లేకుండానే అనంతపురంలోని శ్రీనివాసనగర్‌లో రూత్ ఆస్పత్రిని డాక్టర్ లక్ష్మీకాంతమ్మ నిర్వహిస్తోందని గుర్తించారు. అంతేకాక మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ(అబార్షన్) చేయడానికి అనుమతులు లేకున్నా 2022 నుంచి ఇప్పటి వరకూ ఏకంగా 99 అబార్షన్లు చేసినట్లు (అఖిల ఆస్పత్రిలో) బహిర్గతం కావడంతో విచారణాధికారులు విస్తుపోయారు. ఈ నేపథ్యంలో రూపొందించిన తుది నివేదికను సోమవారం కలెక్టర్‌కు సమర్పించారు. పరిశీలించిన కలెక్టర్ గౌతమి.. వెంటనే డాక్టర్ లక్ష్మీకాంతమ్మను సస్పెన్షన్‌కు సిఫారసు చేశారు. అయితే డాక్టర్ లక్ష్మీకాంతమ్మ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలో ఉండడంతో కలెక్టర్ చేసిన సిఫారసుతో పాటు విచారణ నివేదికను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి ద్వారా డీఎంఈకి చేర్చేలా డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి చర్యలు తీసుకున్నారు.

చట్టపరమైన చర్యలకు ఆదేశిస్తాం

ఎంటీపీ అనుమతులు తీసుకోకుండా అబార్షన్లు చేసిన డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై విచారణ కొనసాగుతుంది. నిబంధనలకు విరుద్ధంగా అధిక సంఖ్యలో అబార్షన్లు చేశారు. ఎంటీపీ చట్టాన్ని అతిక్రమించిన డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై చట్టపరమైన చర్యలకు ఆదేశిస్తాం.
– డాక్టర్ యుగంధర్, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్

ప్రజారోగ్య పరిరక్షణకు నిరంతర కృషి

- ఎన్‌సీడీసీడీ జేడీ డాక్టర్ నరసింగరావు


మాట్లాడుతున్న ఎన్‌సీడీసీడీ జేడీ డాక్టర్ నరసింగరావు

హిందూపురం టౌన్: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని, ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలకు ఎన్‌సీడీసీడీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నరసింగరావు సూచించారు. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో సోమవారం ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షణ ద్వారా అన్ని అంశాలను క్షుణ్ణంగా తెలుసుకుని ఉత్తమ సేవలందించాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీ కృష్ణారెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్ మాట్లాడుతూ... వివిధ రకాల శిక్షణా కార్యక్రమాలతో వృత్తిపరంగా మరింత మేధోసంపన్నులై ప్రజారోగ్యపరిరక్షణలో ముఖ్య భూమిక పోషించగలుగుతారన్నారు. అనంతరం కుక్క, పాము, కోతి, ఇతర జంతువుల కాటుకు మనిషి గురైనప్పుడు తీసుకోవాల్సిన విధి విధానాలను వివరించారు. రక్తనాళాల ద్వారా అందించే మందులు, అత్యవసర మందుల వాడకం, సూది మందు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యం వికటించినప్పుడు పాటించాల్సిన తక్షణ చర్యలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీపీఎంఓ చిన్నకుల్లాయప్ప నాయక్, ప్రోగ్రాం ఆఫీసర్ నాగరాజు నాయక్, ఆర్‌ఎంఓ డాక్టర్ సురేష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్, శిక్షకులు పి.అరుణ, బి.అరుణ, డీపీఎంఓ, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె వర్సెస్ పెదరాసు

- పుట్టపర్తిలో రాజుకుంటున్న అసమ్మతి
- సామాజిక మాధ్యమాల్లో విమర్శల వర్షం
- విందు రాజకీయాలతో అందరినీ ఏకం చేస్తున్న పెదరాసు
- ఉక్కిరిబిక్కిరవుతున్న మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి: టీడీపీ నేతలు అప్పుడే టికెట్ల కోసం పోరుబాట పట్టారు. రానున్న ఎన్నికల్లో తమకంటే తమకే టికెట్ ఇవ్వాలంటూ సామాజిక మాధ్యమాల ద్వారా అధిష్టానానికి తమ వాణి బలంగా వినిపిస్తున్నారు. అలాగే నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లపై నిరసన గళం వినిపిస్తూ వారి అరాచకాలు, అక్రమాలను బయటపెడుతున్నారు. తాజాగా పుట్టపర్తిలో తమ్ముళ్ల గ్రూపు రాజకీయం రచ్చకెక్కింది.

పల్లెకు టికెట్ వద్దంటూ వాట్సాప్ సందేశాలు..

పుట్టపర్తి నియోజకవర్గంలో పల్లెకు సొంత పార్టీ నుంచే నిరసన సెగ తగులుతోంది. గడచిన నాలుగేళ్లుగా పల్లెకు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమమే నడుస్తోంది. నియోజకవర్గంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన నేతలు పెదరాసు సుబ్రహ్మణ్యం, మున్సిపల్ మాజీ చైర్మన్ పీసీ గంగన్న, ఓడీచెరువుకు చెందిన ఇస్మాయిల్ అసమ్మతి వర్గంలో ప్రధాన భూమిక పోషిస్తున్నారు. టీడీపీ టికెట్ ఈసారి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి ఇవ్వకూడదంటూ గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే గత రెండురోజులుగా పల్లెకు వ్యతిరేకంగా ఏకంగా వాట్సాప్ సందేశాలను వైరల్ చేస్తున్నారు. టీడీపీ గ్రూపులతో పాటు నియోజకవర్గంలోని ప్రతి మండలానికి చెందిన వాట్సాప్ గ్రూపుల్లో పల్లెకు వ్యతిరేకంగా సందేశాలు వైరల్ చేస్తున్నారు.

అసమ్మతి నేతలతో భేటీ..

పల్లెను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పెదరాసు సుబ్రహ్మణ్యం నియోజకవర్గంలోని అసమ్మతి నేతలు, పార్టీ సీనియర్ నేతలను ఏకతాటిపైకి తెచ్చి పల్లెపై పోరుబాటకు పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే పలు సమావేశాలు, విందు మంతనాలు చేశారు. అలాగే పుట్టపర్తిలో పల్లెకు టికెట్ ఇస్తే పార్టీ ఘోరంగా ఓడిపోతోందని టీడీపీ అధిష్టానానికి కూడా గట్టిగానే చెప్పినట్లు తెలుస్తోంది. తాను పల్లె రఘునాథరెడ్డి కంటే పార్టీలో సీనియర్‌నని, పైగా స్థానికుడినని అందువల్లే ఈసారి టికెట్ తనకే ఇవ్వాలని బలిజ సామాజికవర్గానికి చెందిన నేత పెదరాసు సుబ్రహ్మణ్యం ఇప్పటికే పార్టీ పెద్దలను కలిసి డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది.

సీనియర్లు, బీసీలను అణగదొక్కిన పల్లె..

తాము టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ విజయానికి కృషి చేస్తూ వస్తున్నామని 'పల్లె' వ్యతిరేక వర్గం వాదిస్తోంది. చివరకు గతంలో 'పల్లె' గెలుపులోనూ తమదే కీలక పాత్ర అని చెబుతోంది. తాము ఇంత చేస్తే బీసీలు, సీనియర్లను 'పల్లె' ఏమాత్రం పట్టించుకోకపోగా, అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని సుబ్రహ్మణ్యంతో పాటు ఇతర అసమ్మతి నేతలు వాపోతున్నారు. ప్రతి ఎన్నికల్లోనూ తామే సొంతంగా డబ్బులు ఖర్చు చేసి పార్టీ అభ్యర్థుల విజయానికి పాటు పడ్డామని, అలాంటి తమను పల్లె ఏమాత్రం పట్టించుకోవడం లేదని, అందువల్ల తాము ఆయనకు మద్దతు పలికేది లేదని స్పష్టం చేస్తున్నారు.

కార్యకర్తల బాగోగులు విస్మరించి...

పార్టీ కోసం అహరహం శ్రమించిన కార్యకర్తలను, సీనియర్ నేతల బాగోగులను విస్మరించిన పల్లె రఘునాథరెడ్డి...కేవలం తన స్వార్థం తాను చూసుకున్నారని అసమ్మతి నేతలు ఆరోపిస్తున్నారు. 'కియా' కంపెనీ వద్ద 250 ఎకరాలు కొనుగోలు చేసి రూ.వేల కోట్లు సంపాదించారని ఆరోపణలు గుప్పిస్తున్నారు.

తీవ్ర ఒత్తిడిలో పల్లె..

అసమ్మతి నేతల చర్యలతో దిక్కుతోచని స్థితిలో పడిన పల్లె రఘునాథరెడ్డి కొందరిని ఇంటికి పిలిపించి బుజ్జగించే పనిలో పడినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో రోజురోజుకూ తన ప్రాభవం తగ్గుతుండటంతో తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు అనుచరులే చెబుతున్నారు. అసమ్మతి నేతల చర్యలతో ఈసారి టికెట్ వస్తుందో రాదోనని ఆందోళన చెందుతున్నట్లు సమాచారం.


ప్రశాంతంగా అగ్రి, ఫార్మసీ ప్రవేశ పరీక్ష

అనంతపురం: ఏపీ ఈఏపీసెట్-2023లో భాగంగా అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి పరీక్ష సోమవారం ప్రారంభమైనట్లు సెట్ చైర్మన్ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన తెలిపారు. తొలిరోజు మొత్తం 48,622 మంది విద్యార్థులకు గాను, 43,929 (90.35 శాతం) మంది హాజరయ్యారు. అన్ని కేంద్రాల్లోను పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

వ్యక్తి ఆత్మహత్య

లేపాక్షి: మండలంలోని పులమతి గ్రామానికి చెందిన మహేష్(37) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తాగుడుకు బానిసైన మహేష్ నిత్యం మద్యం మత్తులో భార్యతో గొడవ పడేవాడు. దీంతో విసుగు చెందిన భార్య రెండు రోజుల క్రితం పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహేష్ పైకప్పుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రామాంజినప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని మహిళ మృతి


మృతురాలు హనుమక్క

పెనుకొండ: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఆదివారం రాత్రి ఆస్పత్రిలో చేరిన సమయంలో తన పేరు హనుమక్కగా ఆమె పేర్కొంది. సోమవారం తెల్లవారుజామున పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందింది. అయితే మృతురాలు ఎవరైంది తెలియదు. ఆమెకీ తెలిసిన వారు సంప్రదించాలని పోలీసులు కోరారు.

గృహిణిగా ఇంటి బాధ్యతలు మహిళలకు ఎలాగూ తప్పవు.
ఇక ఆదాయ మార్గం గురించి ఆలోచించడం, వాటిని అమలులో పెట్టడం అంటే తగిన వనరులే కాదు ఇంటిల్లిపాదీ అందుకు సహకరించాలి.
హైదరాబాద్ బండ్లగూడ నాగోల్‌లో ఉంటున్న ఆర్.రాజేశ్వరి ని కలిసినప్పుడు 'పదేళ్లుగా చేస్తున్న పచ్చళ్లు, పొడుల వ్యాపారం... ఆదాయంతో పాటు బిజినెస్ ఉమన్‌గానూ గుర్తింపును తెచ్చిపెట్టింది' అని వివరించింది.

కాదేది ఉపాధికనర్హం!

ఇంటి పచ్చళ్లతో ఇల్లు దిద్దుకుంది





● రాజేశ్వరి

'మన ఇళ్లల్లో అన్ని కాలాల్లోనూ ఏవో ఒక పచ్చళ్లు పెట్టడం అనేది గృహిణులకు అలవాటైన పనే. ఇంట్లో నేనూ అలాగే చేస్తుండే దాన్ని. నా చేతి పచ్చళ్లు రుచికరంగా ఉంటాయని ఇంట్లోనూ, బంధుమిత్రులు, చుట్టుపక్కల వాళ్లు బాగా మెచ్చుకునేవారు. అడిగి మరీ చేయించుకునేవారు. దీనికి తోడు నాకు తెలిసిన వాళ్లు విదేశాలకు వెళ్లినప్పుడు తమకు నచ్చిన పచ్చడి, పొడులు తయారు చేసిమ్మని అడిగేవారు.

పదేళ్ల క్రితం...

నోటి మాటతోనే ఒకరొకరుగా పచ్చళ్లు చేసిమ్మని అడిగే వారి సంఖ్య పెరగడం మొదలయ్యింది. దీనినే చిన్న వ్యాపారంగా మార్చుకుంటే బాగుంటుంది కదా అనుకున్నాను. మా ఊరు గుంటూరుకు వెళ్లినప్పుడల్లా అక్కడ రైతుల దగ్గరకు వెళ్లి, కావల్సిన సరుకులను నేరుగా పొలాల నుంచే సేకరించేదాన్ని. ఒకటే నియమం పెట్టుకున్నాను. కేవలం వెజ్ పచ్చళ్లను మాత్రమే పెట్టాలి. అలాగే, రసాయనిక ఎరువు వాడకుండా పండించిన ఆర్గానిక్ పంటల నుంచే సేకరించాలనుకున్నాను. నేరుగా రైతులను కలిసి, వారి ద్వారా పంటలను కొనుగోలు చేయడం, వాటిని బాగుచేయించి, తీసుకురావడమూ పెరిగింది. మిర్చి, పసుపు, మసాలా దినుసులు వంటివి ఏయే ప్రాంతాల్లో ఏయే ఏవి అధికంగా పండుతాయో తెలుసుకుని, ఆ దినుసులను సేకరిస్తూ ఉంటాను.

ఒక్కరిగానే...

మొదట్లో ఒక్కదాన్నే పచ్చళ్లకు అవసరమైనవన్నీ ఏర్పాటు చేసుకునే దాన్ని. అందుకు తగిన పనుల ప్లానింగ్ కూడా చేసుకున్నాను. మెల్లగా మార్కెట్ పెరుగుతుండటంతో సాయానికి మరొకరిని నియమించుకుని, పనులు చేస్తూ వచ్చాను. కామాక్షి ఫుడ్స్ పేరుతో పదేళ్ల క్రితం ఈ వ్యాపారాన్ని రిజిస్టర్ చేయించుకొని, ఇప్పుడు నాతోపాటు మరో ముగ్గురు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాను. మొదట్లో అంతగా తెలియకపోయినా మార్కెట్ గురించి నాకు నేనుగానే ఓ అంచనా వేసుకుంటూ షాప్స్, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఆర్డర్ల ద్వారానూ పచ్చళ్లు సిద్ధం చేస్తుంటాను. టొమాటో, గోంగూర, మాగాయ, నిమ్మకాయ, చింతకాయ.. వంటి పచ్చళ్లు, పొడుల తయారీ రోజూ ఉంటుంది.

రోజూ ఉదయం నాలుగు గంటల నుంచే మొదలయ్యే నా దినచర్య తిరిగి, రాత్రి పదిగంటలకే పూర్తవుతుంది. నాకు ఇద్దరు పిల్లలు. మా వారు ఉద్యోగి. ఇల్లు, పిల్లల బాధ్యతలు చూసుకుంటూనే ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాను. ఏడాదికి ఇరవై లక్షల ఆదాయంతో ఈ మార్గం నాలో ఓ కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. నా చేత్తో నలుగురికి రుచికరమైన పచ్చళ్లను అందివ్వడమే కాదు, నాతో పాటు ఇంకొందరికి ఉపాధినివ్వడం సంతోషంగా ఉంది. ఆర్డర్లను బట్టి తయారీ విధానాన్ని ఎంచుకుంటాను కాబట్టి నష్టం అనే సమస్య ఎప్పుడూ రాలేదు. చేసే పనిలో ముందుగానే అంచనా ఉంటే అది ఉద్యోగమైనా, వ్యాపారమైనా ఇంటితోపాటు సమర్థవంతంగా నిర్వర్తించే సత్తా మహిళలకెలాగూ ఉంటుంది' అని వివరిస్తుంది రాజేశ్వరి.

– నిర్మలారెడ్డి
ఫొటోలు: మోహనాచారి

న్యూస్‌మేకర్స్

నానమ్మ హ్వా.. మనవరాలు హ్వా...



● గీతా గోదరా, ఆష్కా

మనవరాలు కరాటే చేస్తుంటే నానమ్మ తోడుగా నిలబడి చూడటం అనవాయితీ.
కాని నానమ్మ కూడా కరాటే డ్రస్సు తొడుక్కుని గోదాలో దిగితే?
గుర్‌గావ్‌కు చెందిన 60 ఏళ్ల గీతా గోదరా ఆమె 13 ఏళ్ల మనవరాలు ఆష్కా గోదరా దుబాయ్‌లో తాజాగా జరిగిన కరాటే ఛాంపియన్ షిప్‌లో మెడల్స్ సాధించారు.
ఈ కాలపు నానమ్మ–మనవరాలు ఇలాగే ఉండాలని అందరూ మెచ్చుకుంటున్నారు.

గుర్‌గావ్‌లోని సెక్టార్ 5లో రెండేళ్ల క్రితం మనవరాలికి తోడుగా కరాటే అకాడెమీకి బయలుదేరిన గీతా గోదరా ఇదంతా ఇంత వేగంగా జరుగుతుందని అనుకోలేదు. తాను కూడా కరాటే ఛాంపియన్ అవుతానని అసలు అనుకోలేదు.

'నేను పుట్టింది హర్యానాలోని పల్లెటూళ్లో. నా చదువు ఐదవ క్లాసుతో ముగిసిపోయింది. చిన్నప్పటి నుంచి సాహస కార్యాలు చేయాలని ఉండేది. ఒక వయసులో సైన్యంలో చేరాలని అనుకున్నాను. ఏవీ జరగలేదు. సంసారంలో పడ్డాను. నా మనవరాలు ఆష్కాకు నేను అనం పూర్తిగా వదిలేసిన కలలు నెరవేర్చుకునే వీలు ఉంది. అందుకని తను ఏం కోరినా సపోర్ట్ చేయాలనుకున్నాను. కరాటే నేర్చుకుంటానంది. నేను తోడుగా వెళ్లడం మొదలెట్టాను' అంది గీతా గోదరా.

ఆమె ఇటీవల దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ (బుడోకాన్ కప్)లో 83 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ గెలుచుకుంది. 22 దేశాల నుంచి ఈ పోటీల్లో కరాటేలో పాల్గొంటే వారిలో మన దేశం నుంచి 30 మంది ఉన్నారు. ఇంత మందిలో గీతా గోదరా మెడల్ సాధించింది.

'రోజూ నా మనవరాలు చేస్తున్న సాధన చూస్తే నాక్కూడా కరాటే నేర్చుకోవాలనిపించింది. ట్రైనర్ సునీల్‌ను అడిగాను– నా వయసు వారు నేర్చుకోవచ్చా అని. ఏ వయసు వారైనా నేర్చుకోవచ్చు... ఆసక్తి ఉండటమే ప్రధానం అని చెప్పాడు. వెంటనే నేను కూడా నేర్చుకోవడం మొదలెట్టాను' అంది గీతా గోదరా.



● గీతా గోదరా

కాని ఈ పరిస్థితి మనవరాలు ఆష్కాకు ఇబ్బంది తెచ్చి పెట్టింది. 'నాతో పాటుగా మా నాయనమ్మ కూడా కరాటే ప్రాక్టీసు చేస్తుంటే నా స్నేహితులు ఆట పట్టించారు. నేను కూడా మా నాయనమ్మ ఇది చేయకపోతే బాగుండు అనుకున్నాను. కాని అకాడెమీలో ఆమె అన్ని ఎక్సర్‌సైజులను చాలా బాగా చేస్తుంది. పంచ్ గట్టిగా విసురుతుంది. ఆమెలో బలం చూసి ఆశ్చర్యపోయాను. ఇప్పుడు మెడల్స్ తెస్తుండటంతో గర్వపడుతున్నాను' అంది ఆష్కా.

'కరాటే మనసును, శరీరాన్ని ఒక తూగులో ఉంచుతాయి. ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి. ఆత్మస్థయిర్యాన్ని కూడా ఇస్తాయి. ఇలాంటి ఒక వ్యాపకం ఉండటం స్త్రీలకు అవసరం' అంటోంది గీతా గోదరా.

స్త్రీలకు ఆత్మరక్షణ విద్యలు తప్పనిసరి అనిపిస్తున్న ఈ రోజుల్లో ఈ నానమ్మ, మనవరాలు ఇస్తున్న సందేశంతో స్ఫూర్తి పొందాల్సిందే.

బ్యూటిప్

జుట్టు ఆరోగ్యంగా పెరగాలంటే...



కప్పు పెసరపప్పును ఉడికించి మెత్తగా పేస్ట్ చేసి అందులో కోడిగుడ్డు సొన (పసుపు– తెలుపు మొత్తంగా), టేబుల్ స్పూన్ నిమ్మరసం, కప్పు పెరుగు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకు పట్టించి రెండు గంటల తర్వాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేయాలి. వారానికోసారి ఈ మూంగ్‌దాల్ హెయిర్ ప్యాక్ వేస్తే జుట్టు ఆరోగ్యంగా నిగనిగలాడుతూ, ఒత్తుగా పెరుగుతుంది.

గమనిక: ప్రతిరోజూ నానబెట్టి గ్రైండ్ చేయడం సాధ్యం కాకపోతే పెసలను మరపట్టించి పిండిని నిల్వ చేసుకుని రోజూ వాడుకోవచ్చు. తాజాగా నానబెట్టి గ్రైండ్ చేస్తే పెసరలోని పోషకాలు త్వరగా చర్మానికి అందుతాయి.

సాగుబడి
రోహిణీ కార్తె : మే 25 నుంచి

మిత్రపురుగుల సేద్యం

■ ఎకలాజికల్ ఇంజనీరింగ్ సాగు పద్ధతులను ప్రాచుర్యంలోకి తెస్తున్న ఎన్.ఐ.పి.హెచ్.ఎం.


తోటల్లో చెట్ల వరుసల మధ్య ఇలా పూల మొక్కలు వేస్తే మిత్రపురుగులు వస్తాయి


రోడ్ల పక్కన ఖాళీల్లో పూల మొక్కల పెంపకం.. ఇవే మిత్ర పురుగుల కారిడార్లు!


ఎకలాజికల్ ఇంజనీరింగ్: పంటల మధ్య గట్లపై పూల మొక్కల పెంపకం


ఈ బొరియలూ తేనెటీగల ఆవాసాలే

5న ప్రకృతి రైతుల మహా సమ్మేళనం

జూన్ 5(సోమవారం)న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో ప్రకృతి రైతుల మహా సమ్మేళనం నిర్వహించనున్నారు. పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ గ్రౌండ్‌లో ఉ. 10 గంటలకు సమ్మేళనం ప్రారంభమవుతుంది. పొలాన్ని అమ్మే వ్యవసాయం మానేద్దాం పొలాన్ని కొనుగోలు చేసే వ్యవసాయాన్నే చేద్దాం అనే నినాదంతో ఈ మహా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ నేత కుమారస్వామి తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 10 వేల మంది రైతులు, వినియోగదారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అందరూ ఆహ్వానితులే.

తేనెటీగలు.. ఇవి 3 కోట్ల సంవత్సరాల క్రితం నుంచే భూగోళంపై జీవిస్తున్నాయి. మొక్కల/వ్యవసాయ జీవవైవిధ్యానికి, పర్యావరణ వ్యవస్థల మనుగడకు పరాగ సంపర్కం కీలకం. అడవిలో 90% మొక్కలు, చెట్లకు, 75% పంటలకు తేనెటీగలు తదితర ప్రాణుల వల్ల జరిగే పరాగ సంపర్కమే ఆధారం. 115 ప్రధాన ఆహార పంటలు ప్రపంచ ప్రజల ఆకలితీర్చుతున్నాయి. వీటిలో 87 పంటలు పుష్పించి సక్రమంగా పంట దిగుబడులు ఇస్తున్నాయంటే అందుకు 35% కారణం తేనెటీగలు తదితర చిరు మిత్ర జీవులే. రసాయనిక వ్యవసాయ పద్ధతులు, చెట్లను నరికేయటం వల్ల వీటి మనుగడ ప్రమాదంలో పడింది. తేనెటీగలు వంటి మిత్ర పురుగులను రక్షించుకోవటం మన ఆహార భద్రతకు, పర్యావరణ ఆరోగ్యానికి ప్రాణావసరమని ఐరాసకు చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) చెబుతోంది. మనం వినిపించుకోవాలి.

ప్రతి నాలుగు పంటల్లో మూడు పంటలు తేనెటీగల సేవలు అందుకుంటున్నాయి. బాదం పంట దిగుబడులైతే నూటికి నూరు శాతం వీటిపైనే ఆధారపడి ఉంటుంది. తేనెటీగలకు 5 కళ్లు, రెండు రెక్కలుంటాయి. కొన్నయితే గంటకు 20 మైళ్లు ప్రయాణిస్తూ పరాగ సంపర్కానికి తోడ్పడుతుంటాయి.

పంటల మార్పిడి, వైవిధ్యత..

పర పరాగ సంపర్కానికి తోడ్పడే ఈ చిరుప్రాణులకు హాని కలిగించని బాధ్యతాయుతమైన వ్యవసాయ పద్ధతులను అనుసరించమని అంతర్జాతీయ తేనెటీగల దినోత్సవం (మే 20) సందర్భంగా ఎఫ్.ఎ.ఓ. పిలుపునిచ్చింది. 'పంటల మార్పిడి, పంటల వైవిధ్యత, రసాయనిక పురుగుమందుల వాడకాన్ని తగ్గించటం, పరాగ సంపర్కానికి దోహదపడే తేనెటీగలు వంటి చిరు జీవులకు అవసరమైన ఆవాసాలను అంటే చెట్లను, పూల వనాలను పునరుద్ధరించటం, అభివృద్ధి చేయటం వంటి చర్యలు తీసుకోవాలని ఎఫ్.ఎ.ఓ. డైరెక్టర్ జనరల్ క్యు డోంగ్యు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలు, రైతులు ఈ పిలుపును అందుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గిస్తే సీటిలో వీటి అవశేషాలు తగ్గుతాయి. తేనెటీగలకు మేలు జరుగుతుంది అన్నారాయన.

తేనెటీగల పరిరక్షణకు స్లొవేనియా విశేష కృషి చేస్తోంది. 2016 నుంచి మే 20వ తేదీని అంతర్జాతీయ తేనెటీగల దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరుపుకోవ డానికి స్లొవేనియా ప్రభుత్వ కృషే కారణం. ఖండాంతర దేశాల్లో 300కు పైగా తేనెటీగల పరిరక్షణ కార్యక్రమాల్లో స్లొవేనియా భాగస్వామైంది.

* * *

ఎన్.ఐ.పి.హెచ్.ఎం. అధ్యయనం

హైదరాబాద్ రాజేంద్రనగరలోని జాతీయ మొక్కల ఆరోగ్య యాజమాన్య సంస్థ (ఎన్ఐపిహెచ్ఎం) శాస్త్రవేత్తలు తేనెటీగలు సహా అనేక మిత్ర పురుగుల వల్ల ఏయే పంటల సాగులో ఏ విధంగా ప్రయోజనం ఉంటుందనే అంశంపై అధ్యయనం చేశారు. మిత్రపురుగుల సంరక్షణతో కూడిన 'ఎకలాజికల్ ఇంజనీరింగ్' పద్ధతులపై జరిగిన అధ్యయనానికి అదనపు సంచాలకులు(పిహెచ్ఎం) డాక్టర్ ఈడ్పుగంటి శ్రీలత సారథ్యం వహించారు. పొద్దుతిరుగుడు, జనుము, మొక్కజొన్న, స్వీట్‌కార్న్, వంగ, బెండ, గుమ్మడి, సొర, బీర, చెర్రీ తదితర పంటలపై ఈ అధ్యయనం జరిగింది. గట్ల మీద పూల మొక్కలు సాగు చేశారు. 9 జాతులకు చెందిన 14 రకాల ఈగలు ఈ కూరగాయ తోటల్లో పరాగసంపర్కానికి దోహదపడినట్లు గుర్తించారు. అందులో 5 రకాల తేనెటీగలు ఉన్నాయి. వంగ తోటలో 14 రకాల ఈగలు కనిపించటం విశేషం.

ఎకలాజికల్ ఇంజనీరింగ్ అంటే?

'ఎకలాజికల్ ఇంజనీరింగ్' భావనను 1962లో తొలిత ప్రతిపాదించిన శాస్త్రవేత్త డా. హోవర్డ్ టి. ఒడుమ్. రసాయనిక సాంద్ర వ్యవసాయ పద్ధతుల వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని గుర్తించి, పంట పొలాల్లో పర్యావరణ వ్యవస్థలను పునరుజ్జీవింపజేయటం, తద్వారా మొక్కలు, భూమి ఆరోగ్యాన్ని కాపాడటం, ఆరోగ్యదాయకమైన ఆహారాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవటం ఈ భావన ముఖ్య లక్ష్యం. భూమిని బాగు చేయడానికి ఆచ్ఛాదన పంటలు, పంటల మార్పిడి, పచ్చిరొట్ట పంటలను సాగు చేసి కలియదున్నటం, సేంద్రియ ఎరువులతో పాటు జీవన ఎరువులు, జీవ రసాయనాలు వినియోగించటం ఎకలాజికల్ ఇంజనీరింగ్‌లో ముఖ్యమైన అంశాలు.

మిత్రపురుగులను ఆకర్షించడానికి ఆకర్షక పంటలు, శత్రుపురుగులను ఆకర్షించి మట్టుబెట్టడానికి ఎర పంటలు, శత్రుపురుగులను పారదోలడానికి వికర్షక పంటలు, పురుగులు తోటలోకి రాకుండా చూడటానికి కంచె/సరిహద్దు పంటలు వేసుకోవటం చీడపీడల నియంత్రణలో కీలకం. 'పంటల తొలి 40 రోజుల్లో రసాయనిక పురుగుమందులు వాడకుండా ఉండటం ముఖ్యం. ఈ దశలోనే తేనెటీగలు సహా అనేక రకాల మిత్రపురుగులు వృద్ధి చెంది పంటకాలం అంతటా చీడపీడలను నియంత్రణలో ఉంచుతాయి..' అంటున్నారు డా. శ్రీలత . 86 పంటల 'ఎకలాజికల్ ఇంజనీరింగ్' కోసం వెబ్‌సైట్ చూడొచ్చు.. https://niphm.gov.in/


బెండ పంటను రక్షించే మిత్ర పురుగులు

తేనెటీగలను మింగుతున్న రసాయన సేద్యం


● బెంగళూరు గ్రామీణ ప్రాంతాల్లో 20% తగ్గిన మిత్రపురుగులు

వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం పెరుగుతున్న కొద్దీ సహజ తేనెటీగల సంఖ్య తగ్గిపోతున్నట్లు అనేక అధ్యయనాల్లో తేలింది. బెంగళూరు ప్రాంతంలో జరిగిన ఓ అధ్యయనంలో ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి. నగరం చుట్టూతా విస్తరించిన 40 కిలోమీటర్ల ప్రాంతంలోని 60 గ్రామాల్లో అధ్యయనం చేస్తే సహజ తేనెటీగల సంఖ్య ఏకంగా 20% తగ్గినట్లు వెల్లడైంది. జర్మనీకి చెందిన గొట్టింజెన్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం పరిశోధించింది. రసాయనిక వ్యవసాయం విస్తీర్ణం, సాంద్రత పెరుగుతున్నకొద్దీ తేనెటీగలు సమూహాలు తగ్గిపోతుండటాన్ని గుర్తించారు.

▶ నగరం నుంచి ప్రతి కిలోమీటరు దూరంగా వెళ్లే కొద్దీ ఆయా ప్రాంతాల్లో తేనెటీగల సంఖ్య 2.4% మేరకు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ▶ 2016 డిసెంబర్– మే 2017 మధ్య 1275 కుటుంబాలపై అధ్యయనం చేశారు. ఇందులో 638 రైతు కుటుంబాలు. 3 కుటుంబాలకు చెందిన 31 జాతుల తేనెటీగలు ఆ ప్రాంతాల్లో గుర్తించారు. ▶ చెట్ల మీదనే కాకుండా నేలలో బొరియలు చేసుకొని ఆవాసాలను ఏర్పాటు చేసుకునే తేనెటీగలు ఉంటాయి. కాబట్టి, రసాయనిక పురుగుమందుల వల్లనే కాకుండా రసాయనిక ఎరువులు లేదా నీటి పారుదల వల్ల కూడా తేనెటీగల సంఖ్య తగ్గుతున్నట్లు గుర్తించారు. ▶ ఒక రైతు తన పొలంలో రసాయనిక ఎరువులు వాడటం లేదా నీటి తడి పెట్టడం చేస్తే అక్కడ తేనెటీగల సంఖ్య 20% తగ్గినట్లు పరిశోధకులు గుర్తించారు.

▶ పరిసరాల్లోని ఒక్కో పొలంలో పురుగుమందులు చల్లినప్పుడల్లా ఒక్కో శాతం తేనెటీగల సంఖ్య తగ్గిపోతూ వచ్చింది. అత్యధికంగా 80% మంది రైతులు, సగటున 25% మంది రైతులు రసాయనిక పురుగుమందులు చల్లుతున్నారు. ఆ మేరకు తేనెటీగల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. ▶ అనేక సంవత్సరాల నుంచి ఉధృతంగా రసాయనిక వ్యవసాయం చేస్తున్న గ్రామాల్లో తేనెటీగలు 8.1% మేరకు తగ్గింది.

▶ రోడ్డుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో తేనెటీగల సంఖ్య 17.3% తగ్గిపోయింది. అదేవిధంగా, దగ్గర్లో అడవి లేదా చెరువు ఉన్న చోట్ల 30–39% పెరిగింది. ▶ వ్యవసాయంలో విషరసాయనాలు, ముఖ్యంగా నియోనికోటినాయిడ్స్, వాడుతుండటం వల్ల తేనెటీగల నాడీవ్యవస్థ దెబ్బతింటున్నది. ఈ ప్రభావం వల్ల తేనె సేకరణకు వెళ్లిన తేనెటీగలు, ఇంకా ఇతర మిత్ర పురుగులు తిరిగి గూళ్లకు చేరకుండానే పేలరాలు తున్నట్లు పరిశోధకులు గుర్తించారంటున్నారు తేనెటీగల సంరక్షకురాలు జపూర్వ.





రసాయనాల మయమైపోయిన వ్యవసాయ పద్ధతిని ప్రకృతికి అనుగుణంగా మార్చుకుంటే భూతాపాన్ని తగ్గించడానికి, వాతావరణ మార్పుల్ని పంటలు ధీటుగా తట్టుకొని మంచి దిగుబడులు ఇవ్వడానికి అవకాశం ఉందన్నది తెలిసిందే. అదే విధంగా.. ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటిస్తే పంటల్లో వైవిధ్యత పెరుగుతుంది. పక్షులు తదితర జీవరాశితోపాటు మట్టిలో సూక్ష్మజీవరాశి వైవిధ్యత కూడా పెరుగుతుందని ఐరాసకి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ జీవవైవిధ్య పరిరక్షణ దినోత్సవం(మే 22) సందర్భంగా మరికొన్ని విషయాలు..

● ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ క్షేత్రాల్లో భూమి పైన పంటలు, పక్షులు, తేనెటీగల్లాంటి మిత్రపురుగులతోపాటు భూమి లోపల వానపాములు, సూక్ష్మజీవరాశికి సంబంధించిన జీవవైవిధ్యం 30–50% పెరుగుతుందని అనేక అధ్యయనాల్లో వెల్లడైందని 'ఐఫోమ్ ఆర్గానిక్స్ యూరప్' తాజా నివేదిక చెబుతోంది. ఈ క్షేత్రాల్లో పంటలు, పక్షులు, మిత్రపురుగులు, సూక్ష్మజీవుల సంఖ్య 50% ఎక్కువగా ఉంటుందని, వీటి జాతుల సంఖ్య 30% అధికంగా ఉంటుందని నివేదిక పేర్కొంది.

● రసాయనాలు వాడని గడ్డిభూముల్లో కన్నా ప్రకృతి/సేంద్రియ పద్ధతుల్లో సాగయ్యే వార్షిక పంటల్లో, పండ్ల తోటల్లో జీవవైవిధ్యం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

● ప్రకృతి/సేంద్రియ సాగులో తేనెటీగలు, సాలీళ్లు, తదితర అరుదైన మిత్రపురుగుల సంఖ్య రసాయనిక క్షేత్రాలతో పోల్చితే 55% ఎక్కువగా, వీటి జాతుల వైవిధ్యం 27% ఎక్కువగా ఉందని నివేదిక తెలిపింది.

● ప్రకృతి/సేంద్రియ క్షేత్రాలు ఉన్న ప్రాంతాల్లో నాటు తేనెటీగల సంఖ్య, జాతుల వైవిధ్యంతో పాటు వాటి పునరుత్పత్తి రేటు కూడా పెరిగిందని ఐఫోమ్ ఆర్గానిక్స్ యూరప్ నివేదిక తెలిపింది.

● ఆంధ్రప్రదేశ్‌లో 50 ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు, 50 రసాయనిక వ్యవసాయ క్షేత్రాల్లో సంచరించే పక్షుల సంఖ్యపై ఏపీ ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయ విభాగం (ఏపీసీఎన్ఎఫ్) గత ఏడాది ఓ అధ్యయనం చేసింది.

● ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో రెండు తోకల పిట్ట, నేత పక్షి, గిజిగాడి గూడు పక్షి, పిగిలి పిట్టలు 2,3 రెట్లు ఎక్కువగా తరచూ తిరుగాడుతూ కనిపించాయని ఏపీసీఎన్ఎఫ్ నిపుణుడు ఈ అధ్యయనానికి సారథ్యం వహించిన ఏపీసీఎన్ఎఫ్ పరిశోధనా విభాగం హెడ్ డా. జాకిర్ హుస్సేన్ తెలిపారు. రసాయనిక క్షేత్రాల కన్నా ప్రకృతి పొలాలను ఎక్కువ పక్షులు సందర్శిస్తున్నాయన్నారు. పక్షుల రాక వల్ల శత్రుపురుగుల తీవ్రత తగ్గుతున్నదన్నారు.

● కర్నూలు జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదయ్యే చోట ప్రకృతి పొలాల్లో నేత పక్షి గూళ్లు కనిపించటం విశేషం.